తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం
9 ఏప్రిల్ 2026
పేజీలు : 08



Follow :

# చేతిలో ఫోన్ వద్దు..
# పుస్తకాలే ముద్దు

## జీవితాలను మార్చేదే పాఠశాల విద్యనే



- కలలు కనండి వాటిని నిజం చేసుకోండి
- 5వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు
- కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ కొలి వెంకటేశ్వర్

**ధారూర్ ఏప్రిల్ 08(జనంసాక్షి) :** విద్యార్థులు చిన్నవయసులో సెల్ ఫోన్ కు దూరంగా ఉండి పుస్తకాలను చదవాలని జీవితాన్ని మర్చేదే విద్యా.కష్టమైన ఇష్టంగా చదివినప్పుడే రాబోయే కాలంలో మంచి మంచి అవకాశాలు అందరికి వస్తాయని గ్రామ సర్పంచ్ కోలి వేంకటేశ్వర్ విద్యార్థులకు సూచించారు.మండల పరిదిలోని నాగసముందర్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమవేశం నిర్వహించారు. ఈ సమవేశానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ కోలి వేంకటేశ్వర్ పాల్గొని మాట్లాడుతూ...ఈ రోజు మనందరికీ భావోద్వేగాలతో నిండిన ఒక ప్రత్యేకమైన రోజు.మీ విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన అధ్యాయం ముగియబోతున్న ఈ సందర్భంలో మీ అందరికీ మా హృదయపూర్వక ఆత్మీయ వీడ్కోలు శుభాకాంక్షలు. చాలా ఆనందంగా ఉంది,కొంత బాధగా కూడా ఉందని తెలిపారు. మీరు మొదటిసారి ఈ విద్యాసంస్థలో ఒక్కటో తరగతిలో అడుగుపెట్టిన రోజు నుంచి ఇప్పటి వరకు మీరు సాధించిన ప్రగతి నిజంగా ప్రశంసనీయం.బుడిబుడి అడుగులతో మొదలైన మీ విద్యా ప్రయాణం,ఇక్కడ గడిపిన ప్రతి క్షణం తరగతి గదుల్లో నేర్చుకున్నపాఠాలు,మైదానంలో ఆడిన ఆటలు, స్నేహితులతో పంచుకున్న నవ్వులు,గురువుల నుండి పొందిన మార్గదర్శకత్వం ఇవి అన్నీ మీ జీవితంలో అమూల్యమైన జ్ఞాపకాలుగా నిలుస్తాయని అన్నారు.జీవితం ఒక నిరంతర ప్రయాణం.ఈ విద్యాలయం మీకు కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం మాత్రమే కాకుండా విలువలు,క్రమశిక్షణ,బాధ్యత, మరియు మనిషిగా ఎదగడానికి అవసరమైన గుణాలను నేర్పింది.మీరు ఇక్కడ నేర్చుకున్న ఈ విలువలను మీ భవిష్యత్తులో మార్గదర్శకంగా ఉంటాయి.

ఇప్పుడు మీరు ఆరవ తరగతిలోకి అడుగిడితున్నారు.మీ ముందు ఎన్నో అవకాశాలు,ఎన్నో సవాళ్లు ఉన్నాయి.మీరు ఎలాంటి మార్గాన్ని ఎంచుకున్నా దానిని నమ్మకంతో,కృషితో, మరియు పట్టుదలతో కొనసాగించండి.అలాగే సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడం మీ బాధ్యతగా భావించండి.మీరు ఎక్కడికి వెళ్లినా,ఈ విద్యాసంస్థ మీకు ఒక బలమైన పునాది అని ఎప్పటికీ మరచిపోకండి.ఇక్కడి అనుభవాలు,స్నేహాలు, మరియు గురువుల ఆశీస్సులు ఎల్లప్పుడూ మీ వెంట ఉంటాయి.మేము మీ ప్రతి విజయాన్ని గర్వంగా చూస్తాం.మీరు సాధించే ప్రతి చిన్నవిజయము మాకు ఆనందాన్నిఇస్తుంది.మీరు ఎదుర్కొనే ప్రతి సవాల్లో ధైర్యంగా నిలబడాలని కోరుకుంటున్నాం.చివరిగా,మీ అందరికీ చెప్పేది ఒక్కటే పెద్ద కలలు కనండి,వాటిని సాధించడానికి కష్టపడండి, ఎప్పుడూ వెనక్కి తగ్గవద్దు. మీ భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉండాలని,మీరు ఎంచుకున్న ప్రతి మార్గంలో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూన్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగ రెడ్డి.ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అశోక్.అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్.యాదమ్మ. ఉపాధ్యాయులు అరుణ. యాదమ్మ.అరుణ.సరిత. శాంతమ్మ.అంగన్వాడి టీచర్ జగదీశ్వరి విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆడపిల్ల పెళ్లికి అండగా నిలుస్తున్న
# కేసారం సర్పంచ్

## గ్రామంలో ప్రతి ఇంటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ. 25 వేల ఇచ్చి ఆదుకుంటున్న గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య

**మోమిన్ పేట ఏప్రిల్ 8 (జనం సాక్షి) :**



గ్రామంలో పెళ్లిళ్ల కొచ్చిన ఆడబిడ్డలను ఆదుకుంటున్న మనసున్న మహారాజు గా పేరు సంపాదించి గ్రామ ప్రజలకు అండగా నిలుస్తున్న కేసారం గ్రామ సర్పంచ్ గుద్దని కిష్టయ్యను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వార్డు సభ్యులు పేర్కొంటున్నారు. కేసారం గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముందుండే నాయకత్వాన్ని మరోసారి చాటుతూ కేసారం గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య ఆడపిల్ల పెళ్లికి ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన లక్ష్మీగారి సుమలత వివాహం సందర్భంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రూ.25,000 చెక్కును సర్పంచ్ స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా పెళ్లికూతురు తల్లి బందమ్మ, తండ్రి అంతయ్య సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆడపిల్లల పెళ్లిళ్లలో ఎదురయ్యే ఆర్థిక భారం తగ్గించేందుకు ఇలాంటి సహాయం ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతలను కూడా సమానంగా నిర్వర్తిస్తున్న సర్పంచ్ గుజ్జరి కిష్టయ్యపై గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం ఆయన నాయకత్వానికి నిదర్శనంగా నిలుస్తోందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, 8 వార్డు సభ్యులు మొహమ్మద్ ఇఫాయత్ 10 వార్డు సభ్యుడు సులేమాన్ గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు.



## తప్పిపోయిన బాలుడు

**శామీర్ పేట, ఏప్రిల్ 8 (జనంసాక్షి) :** ఓ బాలుడు తప్పిపోయిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం శామీర్ పేట మండలం తూంకుంటలో దెరుహు నిషాద్ కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. ఈనెల 5న దెరుహు నిషాద్ తన భార్యతో కలిసి ఉదయం బయటకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు వచ్చారు. ఇంట్లో చూసేసరికి చిన్న కుమారుడు ఒక్కడే ఉండగా పెద్ద కుమారుడు త్రిమ్యాంక్ నిషాద్ (12) ఇంట్లో కనిపించ లేదు. చుట్టుపక్కల వెతికారు. ఈనెల 6న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శరీర నిర్మాణం మధ్యస్థం, బాలుడు రంగు మాధ్యమం జుట్టు నల్లగా, ఎరుపు రంగు టీ-షర్ట్, నల్ల రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వాళ్లు శామీర్ పేట పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆ పిల్లలు.. మన పిల్లలే

- మానవీయ కోణంలో ఆలోచించండి
- జవహర్ నగర్ లో పిల్లల విద్యా, ఆరోగ్యం కోసం
- పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలి
- బస్తీలకు దగ్గరలో స్కూళ్లు ఏర్పాటు చేయాలి
- బాలల హక్కుల సంక్షేమ సంఘం

మిగితా మెయిన్‌లో

# తలకొండపల్లిలో అగస్త్య హాస్పిటల్ ప్రారంభం

- అందరికీ అందుబాటులో ఉండే ధరలకే వైద్యాన్ని అందించాలి
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి





**తలకొండపల్లి ఏప్రిల్ 08(జనంసాక్షి):** తలకొండపల్లి మండల పరిధిలోని ఎక్స్ రోడ్డు చౌరస్తా దగ్గర డాక్టర్ జంప్ల నాయక్ నూతనంగా నిర్మించిన అగస్త్య హాస్పిట ల్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి,జాతీయ బిసి మాజీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులను ఆస్పత్రి నిర్వహకులు డాక్టర్ జాంప్లనాయక్, మేనేజింగ్ డైరెక్టర్ మంజుల, నాయకులను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ..అత్యాధునిక సౌకర్యాలతో ఆస్పత్రిని నిర్మించి అందుబాటులోకి తెచ్చిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.దేవుడిని మనం చూడకుండా మొక్కుతాం..కానీ మన కళ్ళ ముందు కనిపించే డాక్టర్లే మన దేవుళ్ళు అని తెలిపారు.ప్రజలు ఎటువంటి ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని చేరదీసి పునర్జీవం పూసే వారే డాక్టర్లని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతంలో అత్యాధునిక సాంకేతికతతో రోగులకు మెరుగైన సేవలను అందించాలని,అందరికీ అందుబాటులో ఉండే ధరలలో వైద్యాన్ని అందించాలని ఆస్పత్రి నిర్వాహకులను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి పద్మ నరసింహా,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా,మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు,సర్పంచులు కటికల శేఖర్ యాదవ్, దోలి దేవ్లా నాయక్,రామకృష్ణ యాదవ్,జినుకుంట్ల చంద్రశేఖర్, ఏఎంసి వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి,ఉప సర్పంచ్ కోటీశ్వర్,సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి డేవిడ్, జ్యోతయ్య, గోపాల్ నాయక్, పయ్యావుల రమేష్ యాదవ్,కొర్ర కృష్ణ,రవీందర్,రమేష్,రాజేందర్ నాయక్,పవన్ వాల్మీకి,,భాజపా నాయకులు పద్మ అనిల్,నీలకంఠం పాండు,రాజు,తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్నోళ్ల వెంకటేష్ బీజేపీ దళితమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



కొందుర్గు (జనంసాక్షి): దేవాలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసే సమయంలో "హిందూ ధర్మానికి లోబడి పనిచేస్తానని, ఇతర మత ఆచారాల కు దూరంగా ఉంటానని" ప్రమాణం చేసి, ఈస్టర్ సందర్భంగా క్రైస్తవ ర్యాలీలో పాల్గొనడం ధర్మ విరుద్ధము. రాజకీయాలకు అతీతంగా ఉండాల్సిన పదవిలో ఉండి, కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాల్లో బహిరంగంగా పాల్గొనడం సరికాదు. ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే. పదవీ కాలం ముగిసినా, ఒక బాధ్యతా యుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి చర్యలకు పాల్పడటం వల్ల సమాజం లో తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు దర్యాప్తు నిర్వహించి అలాంటి వ్యక్తులను దేవాలయనికి చైర్మన్‌గా నియమించొద్దు.

## మొద్దు మధు మాజీ ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షులు



కొందుర్గు (జనంసాక్షి): "దేవాలయ చైర్మన్ పదవి అనేది కేవలం హిందూ ధర్మాన్ని, సంప్రదాయాలను కాపాడే వారికే దక్కాలి. అన్యమత ర్యాలీల్లో పాల్గొనే వ్యక్తికి ఆ పవిత్రమైన పదవిలో కొనసాగే అర్హత లేదు.ఇప్పటికే ఆయన పదవీ కాలం ముగిసింది. అక్రమంగా చైర్మన్‌గా చలామణి అవుతూ, ధర్మ విరుద్ధంగా ప్రవర్తిస్తున్న చేవెళ్ల కృష్ణయ్యను తక్షణమే ఆ పదవి నుండి అనర్హుడిగా ప్రకటించాలి. ఆయన స్థానంలో ధార్మిక చింతన గల మరొక వ్యక్తిని చైర్మన్‌గా నియమించి దేవాలయ పవిత్రతను కాపాడాలి.

## ఈ వివాదంపై ఆలయ ఈఓ శ్రీనివాస్ శర్మను వివరణ కోరగా, మరో ఆసక్తికర విషయం బయటపడింది

ఈఓ శ్రీనివాస్ శర్మ



కొందుర్గు (జనంసాక్షి): నిబంధనల ప్రకారం చేవెళ్ల కృష్ణయ్య పదవీకాలం ఇప్పటికే ముగిసింది.ఒకవేళ పదవిలో లేకపోయినా, అధికారిక బాధ్యతల పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలితే దానిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతాము. ఈ దర్యాప్తులో అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే, వెంటనే సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపించి తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతాం.

## మంచినీటిలో ప్రెషర్ సమస్యను పరిష్కరించండి



కీసరి నర్సిరెడ్డి

హయత్ నగర్, ఏప్రిల్ 8 (జనంసాక్షి): భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) హయత్ నగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో హెచ్ ఎం డబ్ల్యు ఎస్ జనరల్ మేనేజర్ మహేంద్ర నాయక్ కు మంచి నీటి సమస్యపై వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం హయత్ నగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ శారద నగర్, పరిసర కాలనీలలో మంచి నీరు సరఫరా కావడం లేదని, లో ప్రెషర్ సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వెలిబుచ్చారు. గత ఐదు ఆరు నెలల నుండి సమస్య ఎదురవుతుందని, ఈలో ప్రెషర్ సమస్యను ఇంటర్నే పరిష్కరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా సీజీఎం నాగేంద్ర కుమార్, జనరల్ మేనేజర్ మహేంద్ర నాయక్‌ల దృష్టికి తీసుకు రావడం జరిగిందని, వారు పరిశీలించి భవిష్యత్తులో నీరు సక్రమంగా సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సర్కిల్ కమిటీ సభ్యులు ముషం నరహరి, శాఖ కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం





- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య
- కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

శంకర్ పల్లి, ఏప్రిల్ 8(జనంసాక్షి): పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల,మున్సిపల్ కు సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 47 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.20,68,000/- మరియు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 50 మంది లబ్ధిదారులకు రూ 50,05,800 /-చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఆపదలో ఉన్న వారికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.అలాగే కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్,పథకాల ద్వారా పేద కుటుంబాల పెళ్లిళ్లకు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు.ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకయ్య గౌడ్, తహసిల్దార్ సురేందర్, మరియు మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్,ఆయా గ్రామాల సర్పంచులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆరుట్ల మోడల్ స్కూల్ విద్యార్థుల సమ్మర్ ఇంటర్న్‌షిప్ భవిష్యత్ ఉద్యోగాలకు బలమైన పునాది

ఇబ్రహీంపట్నం, (జనంసాక్షి): మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు వృత్తి విద్యలో భాగంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న 15 మంది విద్యార్థులు రిటైల్ ట్రేడ్‌లో భాగంగా పది రోజుల సమ్మర్ ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ప్రిన్సిపాల్ సుప్రియ మాట్లాడుతూ, పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ అనుభవం విద్యార్థుల భవిష్యత్తుకు అత్యంత కీలకం. ఇలాంటి ఇంటర్న్‌షిప్‌లు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, వారికి నిజజీవిత పరిస్థితులను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని అందిస్తాయి" అని తెలిపారు. కోఆర్డినేటర్ అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ, "విద్యార్థులు ఈ పది రోజుల ఇంటర్న్‌షిప్‌ను పూర్తి నిబద్ధతతో చేస్తే, భవిష్యత్తులో మేము నిర్వహించే జాబ్ మేళాల్లో వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాము" అని హామీ ఇచ్చారు.వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులు ఇబ్రహీంపట్నంలోని ప్రముఖ వ్యాపారి సామాజిక వేత్త చింతల నరసింహ 'ఇంపారాడైస్ షాపింగ్ మాల్'లో ఈ సమ్మర్ ఇంటర్న్‌షిప్‌ను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు రిటైల్ రంగంపై ప్రత్యక్ష అనుభవం లభిస్తూ, భవిష్యత్తులో స్వయం ఉపాధి సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి విలువైన అవకాశాన్ని కల్పించిన తెలంగాణ వొకేషనల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు కి మరియు సమగ్ర శిక్ష అధికారులకు, తెలంగాణ ప్రభుత్వానికి వొకేషనల్ టీచర్ మెండు రాజవర్ధన్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రమాదకరంగా మారిన బోరుబావికి రక్షణ చర్యలు

జనంసాక్షి కథనానికి స్పందన



బొంరాస్ పేట, ఏప్రిల్ 8 (జనంసాక్షి): మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో ప్రమాదకరంగా మారిన బోరుబావి అనే శీర్షిక కథనం జనం సాక్షి ఈనెల 3న వార్తా రూపంలో ప్రచురితం చేసింది.స్పందించిన అధికారులు ప్రమాదకరంగా మారిన బోరుబావి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టి మూసివేశారు.

## ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు వేగం పెరిగింది

ఉప్పల్ (జనంసాక్షి): ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ స్థాపనకు సంబంధించి కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ దిశగా భూమి కేటాయింపు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఉప్పల్, భాగాయత్, సమీప ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మాణా నికి అనువైన స్థలాన్ని గుర్తించాలన్న ప్రతిపాదనపై ముఖ్యమంత్రి కార్యాలయం సానుకూలంగా స్పందించింది. స్థానిక ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి వినతిని పరిగణనలోకి తీసుకొని సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకో వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం స్పష్టమైన సూచనలు ఇచ్చింది. కాలేజీ స్థాపనకు అనువైన భూమి లభ్యత, స్థలం ఎంపిక, మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు వంటి అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని కోరింది. ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలతో ఉప్పల్ ప్రాంతంలో విద్యా రంగ అభివృద్ధికి కొత్త ఊపిరి లభించనుంది. ముఖ్యంగా స్థానిక విద్యార్థులకు సమీపంలోనే ఉన్నత విద్య అందుబాటులోకి రావడంతో పాటు, ప్రాంతీయ సామాజిక-ఆర్థిక అభివృద్ధికి కూడా ఇది దోహదం చేయనుంది.

## ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధుడు మృతి



అబ్దుల్లాపూర్ మెట్ (జనంసాక్షి): అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆటోలో ప్రయాణిస్తున్న గుర్తుతెలియని వృద్ధుడు ఆకస్మికంగా అస్వస్థతకు గురై మృతి చెందాడు.పోలీసుల సమాచారం మేరకు, మంగళవారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో సుమారు 60 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి అబ్దుల్లాపూర్‌మెట్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఆటోలో ఎక్కి ఎల్‌బీ నగర్ వైపు బయలుదేరాడు. మధ్యలో పెద్ద అంబర్‌పేట్‌లోని భారత్ పెట్రోల్ బంక్ సమీపానికి చేరుకునే సరికి ఆ వ్యక్తికి ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు.దీంతో అప్రమత్తమైన ఆటో డ్రైవర్ వెంటనే అతడిని వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించాడు. అక్కడ డ్యూటీ డాక్టర్ పరిశీలించి అతడిని మృతుడిగా ప్రకటించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఉద్యోగ మేళా -యువతకు మంచి అవకాశం

## ఏప్రిల్ 10న శామీర్‌పేట్‌లో ఇంటర్వ్యూలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 8 (జనంసాక్షి):** మేడ్చల్ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రముఖ సంస్థలు బ్లింకిట్, జియో ఫైబర్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. రాధిక తెలిపారు. ఈ ఉద్యోగ మేళా ఏప్రిల్ 10 (శుక్రవారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శామీర్‌పేట్ గ్రామపంచాయతీ భవనం (పోస్ట్ ఆఫీస్ సమీపంలో) నిర్వహించనున్నారు.

**బ్లింకిట్ ఉద్యోగాలు :** పికర్, ప్యాకర్, హెల్పర్, స్ప్రింగ్ వంటి పోస్టులకు నియామకాలు చేపడుతున్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.16,000 పైగా వేతనం (ఈఎస్ఐ, పీఎఫ్‌తో) అందుతుంది. రోజుకు 9 గంటల పని ఉంటుంది. 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ అర్హతతో 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులు. ఆహారం, వసతి సదుపాయాలు కల్పించబడతాయి.

**జియో ఫైబర్ ఉద్యోగాలు:** ఇన్‌స్టాలర్ పోస్టులకు నియామకాలు జరుగుతాయి. నెలకు రూ.20,000 పైగా వేతనం అందుతుంది. 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్ లేదా డిగ్రీ అర్హతతో 2-5 సంవత్సరాల అనుభవం ఉన్న వారు అర్హులు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో హాజరుకావాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 9381369216, 6301318213, 7386809422, 9281435286 నంబర్లను సంప్రదించవచ్చు.

# రావులపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**చేవెళ్ల, (జనంసాక్షి):** గ్రామస్తులు ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకుని వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్ తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల పరిధి రావులపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో మలక్‌పేట్ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆయన సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య గౌడ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం లక్ష్యమని, ఇలాంటి కార్యక్రమాలు మరింతగా చేపడతామని పేర్కొన్నారు. జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, కంటి విభాగాల్లో పరీక్షలు నిర్వహించగా అవసరమైన సూచనలు డాక్టర్ సునీల్, డాక్టర్ అఖిల్, డాక్టర్ అశోక్ రెడ్డి ఇచ్చారు. శిబిరంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనూష అంజన్ కుమార్, పి.ఏ.సి.ఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్, వార్డు సభ్యులు కౌకుంట్ల జ్యోతి వెంకటేష్, జి.మల్లీశ్వరి హనుమంత్, కుమ్మరి గోపాల్, మాజీ ఉప సర్పంచ్ పి.నాగిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు పి.హనుమంత్ రెడ్డి, బుద్దనోల కుమార్, సి.అశోక్, గజ్జలి యాదయ్య, బుద్దనోల కృష్ణ ప్రసాద్, గోటూరి విజయ్ కుమార్, బూర్ల కుమార్, చాకలి రాజు, బేగరి రవీందర్, టీ.లక్ష్మణ్, శ్రీకాంత్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం పట్టివేత

## ముగ్గురిపై కేసు నమోదు



**మల్కాజిగిరి (జనంసాక్షి):** పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎస్ఓటీ , నేరేడ్ మెట్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సిఐ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం నాగాయన్‌పల్లి తండాకు చెందిన బానోతు ఈశ్వర్ (23), బానోతు కవిత (57) , మరో మైనర్ బాలుడు కలిసి న్యూ విద్యానగర్ ప్రాంతంలో అశోక్ లేలాండ్ గూడ్స్ ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు.విశ్వాసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టిన పోలీసులు, వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 96 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బియ్యాన్ని నిల్వ చేసినా లేదా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో విజిలెన్స్ మెరుపు దాడులు



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8 (జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విజిలెన్స్ అధికారుల రాకతో ఒక్కసారిగా దద్దరిల్లింది. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ శిఖాగోయెల్ ఆదేశాల మేరకు అధికారులు ఇక్కడ మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. ఉదయం కార్యాలయానికి చేరుకున్న బృందం తనిఖీలు చేపట్టింది. కంప్యూటర్లలోని డేటా, కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకుంటున్నారు. పథకాల అమలు, నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను నిశితంగా పరిశీలిస్తున్నారు. బయోమెట్రిక్ యంత్రాల ద్వారా సిబ్బంది హాజరు పట్టికను విశ్లేషిస్తున్నారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో కింది స్థాయి సిబ్బందిని అధికారులు విచారిస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ ముగిసిన వివరాలు వెల్లడిస్తాం అని విజిలెన్స్ బృందం స్పష్టం చేసింది.

# చలివేంద్రం ప్రారంభించిన

## మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

### 13వ వార్డు బీఆర్ఎస్ యువనాయకులు కొండ మల్లేష్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**ఫరూఖ్‌నగర్ (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో 13వ వార్డు బీఆర్ఎస్ యువనాయకులు కొండ మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... పెరుగుతున్న వేసవి తీవ్రతలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల సేవే తమ లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ చలివేంద్రం ద్వారా ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు, అలాగే ప్రయాణికులు చల్లని తాగునీరు పొందుతూ ఉపశమనం పొందుతారని తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో పట్టణ కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, వసంత శ్రీనివాస్, జయలక్ష్మి కిషోర్, పిన్నమోని గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, చిన్న యాదగిరి, మాజీ పీఎసిఎస్ డైరెక్టర్ నందిగామ శ్రీనివాస్, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, రవి యాదవ్, చెట్ల జంగయ్య, శ్రీనివాస్, జుట్టు బాలరాజ్, పిట్టల నరసింహా, గుండు అశోక్, మంగ శ్రీశైలం, పిట్టల మల్లేష్, సుధాకర్, రాజు, కొండె శివకుమార్, వెంకటేష్, మల్లేష్, ముస్తి నరేష్, సందీప్ సింగ్, శ్రీను నాయక్, శీలం శ్రీకాంత్, రాజశేఖర్, వంశీ, కొంకళ్ళ అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 10న అంబేద్కర్ నగర్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ

## ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు



**కీసర సర్కిల్ జవహర్ నగర్ (జనంసాక్షి):** అంబేద్కర్ నగర్ లో ఏప్రిల్ 10వ తేదీన సాయంత్రం 6 గంటలకు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మహనీయుల ఉత్సవ కమిటీ వెల్లడించింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్, కోశాధికారి ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, ప్రధాన కార్యదర్శి మొగిలిపాక పరశురాం మాట్లాడుతూ, సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్మరించుకుం టూ ఈ విగ్రహ ఆవిష్కరణను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. అలాగే ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతిని ధులు, వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు హాజరై సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**యాచారం, (జనంసాక్షి) :** అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న తుండ్ల గ్రామంలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి సిఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కందుకూరు మండలం కొలనుగూడ గ్రామానికి చెందిన ఆధర్ల రాజు వయసు 35 ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తాడు. ఇతనికి పెళ్లి జరిగి నాలుగు సంవత్సరాల బాబు ఉన్నాడు. ఆదర్ల రాజు అనుమానాస్పదంగా చిన్న తుండ్ల గ్రామంలో మంగళ్ షాపు వద్ద పడి ఉన్నాడు. ఈ విషయం బుధవారం తెల్లవారుజామున గమనించిన ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి సీఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. కొలను గూడ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో అక్కడికి చేరుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఎవరో ఆదరణ రాజును కొట్టి చంపి ఇక్కడ పడేసి వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు చేశారు. పోలీసులు డాగ్ స్క్వాడ్ టీమ్ రప్పించి వేలిముద్రలను సేకరించారు . కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# సీనియర్ సిటిజన్‌లకు అండగా నిలుస్తాం

## ఉప్పల్‌లో సీనియర్ సిటిజన్ భవనం ప్రారంభం

## మాజీ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్ (జనంసాక్షి) :** సీనియర్ సిటిజన్‌ల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. సీనియర్ పౌరులకు ఎలాంటి అవసరం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా వెంటనే స్పందించి సహాయం అందిస్తామని ఆమె పేర్కొన్నారు.ఉప్పల్‌లో గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రజితా పరమేశ్వర్ రెడ్డి, సీనియర్ సిటిజన్‌ల కోసం ప్రత్యేక భవనం అవసరాన్ని గుర్తించి ఈ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.ఈ భవనం ఏర్పాటుకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి చొరవ తీసుకొని స్థలం కేటాయించి నిర్మాణం పూర్తి చేయించారని ఆమె గుర్తుచేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీనియర్ సిటిజన్‌ల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చారని ఆమె తెలిపారు. ముఖ్యంగా, ఉద్యోగులైన పిల్లలు తమ తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారి జీతంలో నుంచి 15 శాతం నేరుగా తల్లిదండ్రులకు అందే విధంగా చట్టం అమలులోకి తెచ్చారని పేర్కొన్నారు. ఈ విధానం వృద్ధులకు రక్షణ కవచంలా ఉపయో గపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు , స్థాని కులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుమ్మరి కుంట రోడ్డు నిర్మాణానికై మంత్రిని కలిసిన గజ్జి భాస్కర్ యాదవ్



**హయత్ నగర్, (జనంసాక్షి):** ఉమ్మడి హయత్ నగర్ లోని ఉన్న కుమ్మరి కుంట, బాతుల చెరువుల అభివృద్ధి కొరకై టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ ఇంచార్జ్ మధు యాష్కి గౌడ్ ఆదేశాల మేరకు రాష్ట్ర నీటి పారుల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ కలసి వివిధ కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారికి వివరించారు. హయత్ నగర్ లోని బాతుల, కుమ్మరి కుంట చెరువుల గురించి వారితో సుదీర్ఘంగా చర్చించి కుమ్మరి కుంట పై తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. మంత్రి స్పందిస్తూ వెంటనే సంబంధిత ఇరిగేషన్ డిపార్ట్మెంట్ చీఫ్ ఇంజనీర్ ఏఎస్ఎన్ రెడ్డి కి తక్షణమే ఈ విషయము పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. వెం టనే చీఫ్ ఇంజనీర్ (రంగారెడ్డి జిల్లా) ఏ.ఎస్.ఎన్ రెడ్డిని రాష్ట్ర సచివాలయంలో కలిసి మంత్రి ఎండోస్ చేసిన లేఖను వారికి అందజేశారు. వారు వెంటనే సంబంధిత అధికారులకు చెరులను సందర్శించి, రిపోర్టు ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

## ఓయూలో ప్రారంభమైన రెండు రోజుల ఉచిత ఎంప్లాయిబిలిటీ స్కిల్ ట్రైనింగ్




**సికింద్రాబాద్ (జనసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ఉపాధి శిక్షణ శాఖ మరియు నిర్మాణ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండు రోజులు నిర్వహించే ఈ ఉచిత ఎంప్లాయిబిలిటీ స్కిల్ ట్రైనింగ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో డిప్యూటీ చీఫ్ టీ. రాము, యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. దుర్గేశం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ..విద్యార్థులు ఆధునిక ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ టెక్నిక్స్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లో ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మొదటి రోజు నిర్వహించిన ఈ కార్యక్రమానికి 21 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

## నోటి ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి



**ఖైరతాబాద్, ఏప్రిల్ 08 (జనంసాక్షి) :** నోటి ఆరోగ్యంతో శారీరక ఆరోగ్యం ముడిపడి ఉందని పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డా.సోనియా దత్తా (ఎండీఎస్, పీహెచ్డీ) బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ నోటి ఆరోగ్య రీసెట్ అనేది దంత పరిశు భ్రత, మొత్తం ఆరోగ్యం మధ్య ఉన్న కీలక సంబంధం అ న్నారు. శరీర పోషణ, నిద్ర పట్ల మాత్రమే శ్రద్ధ పెట్టి నోటి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయడం మంచిది కాదని అన్నారు. బ్యాక్టీరియా చేరికను తొలగించేందుకు ప్రతిరోజూ రెండు నిముషాల పాటు దంతాలతో పాటు నాలుక శుభ్ర పరచుకోవాలని సూచించారు. ఈ నూతన సంవత్సరంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆమోద ముద్రను కలిగిన డాబర్ రెడ్ వంటి ఉత్ప త్తులు, సంప్రదాయ జ్ఞానం, ఆధునిక క్లినికల్ ధృవీ కరణ మధ్య సమతుల్యాన్ని కోరుకునే వారి ప్రాధా న్య ఎంపికగా మారుతున్నాయని అన్నారు. నోటి ఆరోగ్యంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

## మల్కాజిగిరిలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



**మల్కాజిగిరి, (జనంసాక్షి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. మల్కాజిగిరి చౌరస్తా నుండి అనుటెక్స్ మీదుగా ఆనంద్‌బాగ్ వరకు రహదారికి ఇరువైపులా పాదచారులకు ఇబ్బందికరంగా ఉన్న ఆక్రమణలను భారీ పోలీసు బందోబస్తుతో అధికారులు తొలగించారు. టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పాల్గొని జెసిబి సహాయంతో ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. రోడ్లపై సామాగ్రి ఉంచిన వ్యాపారస్తులను అధికారులు హెచ్చరించారు. పాదచారులు నడవడానికి వీలు లేకుండా ఫుట్ పాత్ ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది మరియు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ టెండర్లలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలి

- తెలంగాణ బీసీ కాంట్రాక్టర్ అసోసియేషన్
- ధర్నా చౌక్ వద్ద బీసీ కాంట్రాక్టర్ల గర్జన





**ముషీరాబాద్, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ కాంట్రాక్టర్లందరికీ ప్రభుత్వ పనుల టెండర్లలో 42% రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ కాంట్రాక్టర్ అసోసియేషన్ డిమాం డ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద గల ధర్నా చౌక్‌లో తెలంగాణ బీసీ కాంట్రాక్టర్ అసోసియేషన్ భారీ ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాకు తీన్మార్ మల్లన్న, కాసాని శ్రీనివాస్ గౌడ్, సమ్మయ్య, ఎంబిటి నాయకులు అమ్జదుల్లా ఖాన్‌లు హాజరై మాట్లాడా రు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వాటా అవకాశం ఉన్నచోట ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ మభ్యపెడు తుం దని దుయ్యబట్టారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా కాంట్రాక్టర్లు లెస్ లో పనిచేసినా బిల్లు లు సకాలంలో చెల్లించకుండా కాంట్రాక్టర్లను ఇబ్బంది పెడుతున్నారనీ, కాంట్రాక్టర్ లు కుటుంబ సభ్యుల బంగారం అంతా బ్యాంకులో పెట్టి కూలీలను పోషిస్తున్నారని, బిసి కాంట్రాక్టర్ల బిల్లు ఇవ్వకుండా ప్రభుత్వం బీసీల పొట్టలు కొడుతుందని అన్నారు. ప్రభుత్వం బడా నేతలకు, ఆంధ్ర కాంట్రాక్టర్లకు అనుగుణంగా టెండర్ నిబంధనలను మార్చిందనీ, కర్ణాటక, ఏపీ, తమిళనాడు తరహాలో తెలంగాణలో కాంట్రాక్టులు ఇచ్చేలా నియమాలు మార్చాలనీ డిమాండ్ చేశారు. బీసీలకు రావలసిన న్యాయమైన వాటా రాకుండా అడ్డుకుంటే ఊరుకునేది లేదనీ, గత ప్రభుత్వంతో 10సంవత్సరాల ఒక్కణ్ణే పోరాడా నని, మిమ్మల్ని గద్దెదింపాడానికి 10 నెలలు సరిపో తుందనీ హెచ్చరించారు. అసోసియేషన్ అధ్యక్షులు సుంకరి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటి సాయికిరణ్ లు మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి టెండర్ నోటీసులో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు ఆర్థికంగా ఎదిగితే తమ ఆధిపత్యా నికి గండి పడుతుందనే కుట్రతోనే ప్రభుత్వం కాంట్రా క్టుల్లో రిజర్వేషన్లు ఇవ్వడం లేదని ఆరోపిం చారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని, తక్షణమే జీవో విడుదల చేయకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. బీసీ కాంట్రాక్టర్ల న్యాయమైన పోరాటానికి ప్రభుత్వం దిగిరావాలని, లేనిపక్షంలో సచివాలయ ముట్టడికి కూడా వెనుకాడబోమని అసోసియేషన్ నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఎస్. భాస్కరరావు, ట్రెజరర్ గాజుల భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ పట్నం శ్రీశైలం, అడ్వైజర్ ఆర్. హనుమాన్ సాగర్‌లతో రాష్ట్రం నలు మూల ల బీసీ కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సమాజ మార్పు కోసం పోరాడిన మహత్తర విప్లవ చైతన్యం జార్జి రెడ్డి

- డాక్టర్ ఎస్. నాగేశ్వర రావు
- జార్జిరెడ్డి 54వ వర్ధంతి సంస్మరణ కార్యక్రమాల ఆవిష్కరణ




**సికింద్రాబాద్ (జనంసాక్షి):** సమాజ మార్పు కోసం పోరాడిన మహత్తర విప్లవ చైతన్యం జార్జి రెడ్డి అని జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షు లు డాక్టర్ ఎస్. నాగేశ్వర రావు పేర్కొన్నారు. పి.డి.ఎస్.యూ వ్యవస్థాపకులు జార్జి రెడ్డి 54 వ వర్ధంతి సందర్భంగా ఆయన అమరత్వాన్ని స్మరిస్తూ జార్జి రెడ్డి పి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో ఈ నెల 14 వరకు సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించ నున్నట్లు నాగేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. సుమంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కె.స్వాతి మాట్లాడుతూ...జార్జిరెడ్డి కేవలం ఒక విద్యార్థి నాయకుడు మాత్రమే కాదని, సమాజ మార్పు కోసం పోరాడిన మహత్తర విప్లవ చైతన్యంగా నిలిచారని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సి టీలో రీసెర్చ్ స్కాలర్ గా, గోల్డ్ మెడలిస్ట్ గా తన ప్రతిభను చాటుతూ విద్యార్థి ఉద్యమాలకు కొత్త దిశానిర్దేశం చేసిన విద్యార్థి నేత అని కొనియా డారు. విద్యారంగం లోని వివక్ష, ఆధిపత్యాలను నిర్మూలించేందుకు జార్జిరెడ్డి తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. విద్య అందరికీ సమాన హక్కుగా మారాలని ఆయన పోరాటం సాగించారని గుర్తు చేశారు. సమాజంలో పేరుకు పోయిన అసమానతలు, ఆధిపత్య ధోరణులు, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన చేసిన నిరంతర పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయక మని అన్నారు. దేశంలో ప్రస్తుతం పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా ప్రైవేటీకరణ, సామాజిక అసమానతల నేపథ్యంలో జార్జి రెడ్డి ఆలోచనలు మరింత ప్రాసంగికమయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, సమాజ సమస్యలపై అవగాహన పెంచుకొని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా సెమినార్లు, చర్చా వేదికలు, ఫోటో ఎగ్జిబిషన్లు, స్మృతిలో వాక్, బృంద చర్చలు వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు విద్యార్థులు, యువత, ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ నాయకులు నవ్య శ్రీ, రంజిత్,నూతన్, అక్బర్, అశోక్, మారుతి, బాలకృష్ణ, చేతన్, సురేష్, రమేష్, ప్రణవి, సింధు, వెంకటేష్, వినీల్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో నేటివ్ సౌత్ కిచెన్, బ్రూ హౌస్ ప్రారంభం




**ఖైరతాబాద్, (జనంసాక్షి) :** సాంప్రదాయ దక్షిణ భారత వంటకాలకు పూర్తిగా అంకితమైన నేటివ్ సౌత్ కిచెన్, బ్రూహౌస్, హైదరాబాద్ వాసు ల కోసం నార్సింగిలో కొత్త భోజనశాలను ప్రారంభి చిందని నేటివ్ సౌత్ కిచెన్, బ్రూ హౌస్ యజమాని ప్రవీణ్ రావు గండ్ర బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటివ్ సౌత్ కిచెన్, బ్రూహౌస్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ శివ షణ్ముగం తోకలసి అయన మాట్లాడుతూ ఈ రెస్టారెంట్, నగ రం సమీపంలోని ఐటీ హబ్‌లో ఆహార ప్రియులకు, ఔత్సాహికులకు ఒక ప్రధాన భోజన కేంద్రంగా మా రనుందని చెప్పరు. తెలంగాణ, తమిళనాడు, ఆం ధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళలకు చెందిన సాం ప్రదాయ వంటకాలను, తాజా, స్థానికంగా లభించే పదార్థా లతో తయారు చేసి అందించనుందని తెలి పారు. మెనూలో ప్రాంతీయ వైవిధ్యాలతో కూడిన ప్రాంతీ య ప్రధాన వంటకాలతో పాటు, ఆధునిక అభిరు చులకు అనుగుణంగా రూపొందించిన వినూత్న మైన శాకాహార, ఆరోగ్య సంబంధిత వంటకాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఇది కేవలం ఒక రెస్టారెంట్‌గా మాత్రమే కాకుండా, కుటుంబాలు, వృత్తి నిపుణులు ఒక చోట చేరి దక్షిణ భారత సంస్కృతిని, ఆహ్లాదక రమైన భోజనాన్ని ఆస్వాదించే ఒక సామాజిక వేదికగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

# సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఘనంగా మణిపూసల పుస్తకాల ఆవిష్కరణ
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి




**తాండూరు (జనంసాక్షి):** సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో ని పెద్దేముల్ మండలం కందనెల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సొంతంగా రచించిన మూడు పుస్తకాలను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యంలో వడిచర్ల సత్యం సృష్టించిన మణిపూసల కవితా ప్రక్రియలో తాటికొండ అర్చన రాసిన "తాటికొండ మణిపూసలు", బింగి గాయత్రి రాసిన "గాయత్రి మణిపూసలు" 24మంది విద్యార్థులు రచించిన "కందనెల్లి కవితలు " అనే పుస్తకాలను శాసన సభ్యులు ఆవిష్కరించారు. స్థానిక పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు శెట్టి శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను సాహిత్యం వైపు ఆలోచింప చేయడం, రచనలు చేసే విధంగా తయారు చేయడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల్లో సృజనాత్మక సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. కవితలు రాసిన 24 మంది బాలబాలికలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పెద్దేముల్ మండలధికారులు వెంకటేష్ ప్రసాద్ ( ఎంఆర్ఓ ), రతన్ సింగ్ (ఎంపిడిఓ), నర్సింగ్ రావు ఎంఈఓ) , డిసిసి అధ్యక్షుడు ధారాసింగ్ , గ్రామ సర్పంచ్ భూమె యాదమ్మ శ్రీనివాస్ , ఉపసర్పంచ్ వాజిద్ , జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ , కోట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య , వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి , ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా పశుఘనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ గాజీపూర్ నారాయణ రెడ్డి , అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీలత , రిటైర్డ్ విఆర్.ఓ వెంకట రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధా నోపాధ్యాయులు ఎల్. నర్సిరెడ్డి , పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

## ట్రాఫిక్ సింగ్నల్స్ దగ్గర గ్రీన్ మ్యాట్ రూఫ్ ఏర్పాటు చేయాలి

### చలివేద్రాలు ఏర్పాటు చేయాలి
### జిహెచ్ఎంసి కమిషనర్ కు డివైఎఫ్ఐ వినతి



**ముషీరాబాద్, ఏప్రిల్ 08 (జనంసాక్షి):** హైదరాబాద్ నగరంలో గత కొన్ని రోజులుగా భారీ స్థాయి లో ఎండలు నమోదు అవుతున్నాయని, రోడ్డు పై వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, ఎండా దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందనీ, వాహన దారులకు ఉపశమనం కల్పించే విధంగా నగరంలో ప్రధాన సిగ్నల్స్ దగ్గర గ్రీన్ మ్యాట్ తో రూఫ్ ఏర్పాటు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) హైదరాబాద్ కమిటీ, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ కి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం జిహెచ్ఎంసి కమిషనర్ కు డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావీద్ జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్య లు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉన్నప్పుడు ఏర్పాట్లు చేసారని గుర్తు చేసారు. ఎండ తీవ్రత ఎక్కువగా నమోదు కావడంతో ప్రజలు, ప్రయాణికులు దాహం తీర్చుకోవడానికి ఇబ్బందులకు గురవుతున్నారనీ, బస్టాప్ లలో ముఖ్యమైన రద్దీ ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తి తీర్చాలని విజ్ఞప్తి చేసారు.

## మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి



**యాచారం, (జనంసాక్షి):** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో ఇటీవల మరణించిన పగిళ్ళ రాములమ్మ, మరియు పోలోజు నరసింహ్మా,ల కుటుంబ సభ్యులను బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి పరామర్శించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో , వార్డు సభ్యులు నూకం శ్రీలత, తెల్గమల్ల భవాని, సీనియర్ నాయకులు జోగి రెడ్డి, తెల్గమల్ల రవీందర్ , మాజీ వార్డు సభ్యులు బండి ఉమారాణి గ్రామస్థులు పాల్గొన్నారు.




## అంగరంగ వైభవంగా భద్రేశ్వర పల్లకి సేవ

### భజనలు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్న వేడుకలు
### శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**తాండూరు (జనంసాక్షి):** పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షులు మేడి మహేష్ మరియు దేవాలయ ఈవో శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం బ్రహ్మోత్సవాల మొదటి రోజు సందర్భంగా భద్రేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. రాత్రి 11 గంటల తర్వాత ప్రారంభమైన ఈ పల్లకి సేవ అర్ధరాత్రి రెండు గంటల వరకు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. పల్లకి సేవకు ముందు భజనలు, ఆటపాటలతో వాతావరణం భక్తిపార్వశంగా మారింది. ఒగ్గు కళాకారుల విన్యాసాలు, పురంతాయాల ఆటపాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో వీరశైవ సమాజం సభ్యులు, పట్టణ ప్రముఖులు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ఘన స్వాగతం పలికారు. భక్తుల శ్రీ భావిగి భద్రేశ్వర మహారాజ్ కి"హర హర మహాదేవ" నినాదాలతో మారుమోగింది. ఇక భక్తులకు సేవ చేయడంలో వివిధ సమాజాలు ముందుండాయి. నగరేశ్వర భజన మండలి, వీరశైవ సమాజం, ఆర్యవైశ్య సమాజం సభ్యులు అడుగడుగునా అల్పాహారాలు ఏర్పాటు చేసి భక్తులకు అందించారు. మరికొందరు భక్తులు టీ, మంచినీళ్లు అందిస్తూ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా మున్సిపల్ చైర్పర్సన్ నిరజబాల్ రెడ్డి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతర ఉత్సవ కమిటీ సభ్యులు గంగా శ్రావణ్ కుమార్,గాజుల విజయ్ కుమార్, లింగమంతుల శంకర్... దేవనూర్..శెట్టి చంద్ర శేఖర్, మాద్రికి చంద్రకాంత్ . కోర్వార్ అంజలి, అగ్గనూరు సంకేత్,ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## మందుల దుర్వినియోగంపై అవగాహన ర్యాలీ, సమావేశం

### ఏప్రిల్ 11న సిఎంఆర్ ఫార్మసీ కళాశాలలో కార్యక్రమం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో డ్రగ్స్ కంట్రోల్ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాల భాగంగా మందుల దుర్వినియోగంపై అవగాహన ర్యాలీ మరియు సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్ 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11న "డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే"ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం కండ్లకోయ గ్రామంలోని సిఎంఆర్ ఫార్మసీ కళాశాలలో ఉదయం 9:30 నుండి 11:00 గంటల వరకు జరుగుతుంది. ఈ సందర్భంగా అలవాటు చేసుకునే మందుల దుర్వినియో గంపై అవగాహన, షెడ్యూల్ హెచ్2 మందులపై క్యూ ఆర్ కోడ్ ధృవీకరణ, మందుల దుష్ప్రభావాల నివేదిక, లైసెన్స్ పొందిన ఫార్మసీల ఆన్‌లైన్ ధృవీకరణ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే నకిలీ మందులపై ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ వివరాలను కూడా తెలియజేయనున్నారు. కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. అన్ని పాల్గొనే వారికి అవగాహన పత్రాలను పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ వార్డు మెంబర్ ఎండి దావుద్



**ధారూర్ (జనంసాక్షి):** మండల కేంద్రానికి చెందిన బాలరాజ్ గౌడ్ కుమార్తె వివాహంలో కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ ఎండి దావుద్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన దంపతులు తమ వైవాహిక జీవితాన్ని సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడపాలని ఆయన ఆకాంక్షించారు. పెళ్లి వేడుకకు విచ్చేసిన ఆయన, వధూవరుల కుటుంబ సభ్యులతో ముచ్చటించి వారికి తన అభినందనలు తెలిపారు. అయనతో వివాహ వేడుకలో సందడి నెలకొంది.

## సమస్యలపై పోరాడుతున్న యువ నాయకులకు సన్మానం



**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** రాజేంద్రనగర్‌లోని భాజపా కార్యాలయంలో ఇద్దరు యువ నాయకులకు గోల్కొండ గోషామహల్ ఇన్‌చార్జ్ వై. శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ బడుగు బలహీన వర్గాల సమస్యలపై పోరాడుతున్న పత్తి రాజు ఇటీవల ఎస్సీఆర్పిఎస్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే అంబేద్కర్ బస్తీకి చెందిన పంబాల రాజు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ నేషనల్ అంబేద్కర్ సేన రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారిని బీజేపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జి. బాబురావు, భీమయ్య, పెంటయ్య, ఎన్. రవీందర్, జ్ఞానేశ్వర్, ఎన్. స్వామి, రఘుమా రెడ్డి, రాములు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, అనీస్, బి. రాజు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎండను సైతం లెక్కచేయకుండా

## జర్నలిస్టుల సమస్య పరిష్కారం

శీనన్నకు కృతజ్ఞతలు తెలిపిన జర్నలిస్టులు.



**తాండూరు (జనంసాక్షి):** గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టుల ప్లాట్ల సమస్యను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్బీఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి చొరవతో పరిష్కృతమైంది. మంగళవారం తాండూర్ మండలం అంతారం గ్రామ సమీపంలోని సునీత మహేందర్ రెడ్డి జర్నలిస్టు కాలనీలో ఆర్బీఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ముందుండి సమస్యను పరిష్కరించారు. ఎండను సైతం లెక్కచేయకుండా జర్నలిస్టులతో కలిసి అక్కడే రెండు గంటల పాటు సమయం వెచ్చించి భూమి సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేయించారు. ప్లాట్ నెంబర్ ప్రకారం జర్నలిస్టులకు అందించేందుకు సర్వం సిద్ధం చేయించారు. దీంతో అక్కడ ప్లాట్లు ఉన్నాయన్న నమ్మకం కల్పించారు. దీంతో జర్నలిస్టులు శ్రీనన్నకు ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు,పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

# ఉద్యోగ రిత్య పదవీ విరమణ సహజమే

- ఆల్ ఇండియా ఎన్ఐసీ అడ్వైజర్ కమిటీ చైర్మన్ సింగారపు శ్రీనివాస్
- వెంకటస్వామి దంపతులకు ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు

**మొయినాబాద్, ఏప్రిల్ 08 (జనంసాక్షి):** ప్రభుత్వ, ప్రైవేటు పరంగా ఉద్యోగ రిత్య సమాజంలో పదవీ విరమణ అనేది సహజమేనని ఆల్ ఇండియా ఎన్ఐసీ అడ్వైజర్ కమిటీ చైర్మన్ సింగారపు శ్రీనివాస్, వికారాబాద్ ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ శ్రీరాములు, ఏజీఎం సుందర్ ఆలీలు పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో గల పావని రిసార్ట్ లో చేవెళ్ల డివిజన్ డెవలప్మెంట్ ఎల్ఐసీ అధికారి వెంకటస్వామి పదవీ విరమణ సన్మాన సభను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాణయ్య, వికారాబాద్ బ్రాంచ్ ప్రెసిడెంట్ కిచ్చన్న గారి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో దంపతులకు వీడ్కోలు, సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వారు పాల్గొని దంపతులను గజమాలతో సన్మానించి పూలహారాలు సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుటుంబంలో జీవిత భీమా అనేది ఎంతో ముఖ్యమైనదని అన్నారు. నేటి ప్రపంచ సమాజంలో ప్రమాదాలు ఎన్నో జరుగుతున్నప్పటికి ఎల్ఐసీ బీమా దేశవ్యాప్తంగా ప్రజలకు అండగా ఉందని తెలిపారు. భీమా పాలసీ ప్రతి ఒక్కరు తీసుకోని తమ బావితరాలకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. జాతీయ స్థాయిలో ఎల్ఐసీ భీమా ఎంతో మంది సద్వినియోగం చేసుకోవడం గర్వకారణంగా ఉందని తెలిపారు. వెంకటస్వామి చేవెళ్ల డివిజన్ డెవలప్మెంట్ ఎల్ఐసీగా పని చేస్తు పదవీ విరమణ పొందడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మొయినాబాద్ మండలంలో ఎల్ఐసీ ఏజెంట్ గా పని చేస్తు ప్రజలకు సేవలు అందించడమే కాకుండా పాలసీలు నిర్వహిస్తు ప్రమాదవశాత్తు మరణించిన వారికి భీమా ద్వారా రావాల్సిన ఆర్థిక సహాయాన్ని చేకూర్చడం తనవంతు కృషిగా పని చేయడం జరిగిందని సూచించారు. పదవీ విరమణ అనేది ఉద్యోగరిత్య సహజమేనని ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మరింత సేవలు చేసేందుకు సాయశక్తుల కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ సుదర్శన్, బ్రాంచ్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, కార్యదర్శి విజయేందర్, కన్వీనర్ కృష్ణకుమార్ గౌడ్, వెంకటస్వామి, యూనిట్ ఏజెంట్లు తమ్మలి మానయ్య, కరుణాకర్, రాములు, శ్రీధర్, అర్చన, లావణ్య, మల్లయ్య, పాండురంగారెడ్డి, నర్సింహులు, మనోహర్, శంకర్ పల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది

- పులుమామిడి గ్రామంలో
- ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన: చేవెళ్ల ఇంచార్జి పామేన భీమ్ భరత్ .. !!



**నవాబుపేట్ (జనంసాక్షి):** నవాబ్ పెట్ మండల పరిధిలోని పులుమామిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ పులుమామిడి గ్రామ సర్పంచి దాన నర్సింలు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టో లో ఇచ్చిన మాట ప్రకారం పులుమామిడి గ్రామానికి చెందిన మంగలి శ్రీలత భర్త మానయ్య మంజూరు అయిన ఇంటిని మంజూరు అయిన సందర్భంగా ఇంటి యజమాని మంగలి శ్రీలత పూర్తి చేశారు .ఈ సందర్భంగా నవాబుపేట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిని ప్రారంభించారు చేవెళ్ల కాంసెన్సీ ఇన్చార్జి భీమ్ భారత్ మాట్లాడుతూ ఎలక్షన్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చే ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఆయన అన్నారు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ,200 యూనిట్ల కరెంటు ఉచితం ,కొత్త రేషన్ కార్డులు ,సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు ,కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్, రైతు బంధు, రైతు బీమా, వృద్ధుల పింఛన్లు, ఒంటరి మహిళకు పింఛన్లు, గత రెండు సంవత్సరాల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేరుస్తుందని ఆయన అన్నారు ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్ పెట్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి , నవాబ్ పేట సర్పంచ్ నరసింహ రెడ్డి , మండల ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి , యూత్ కాంగ్రెస్ నాయకులు గణపురం ప్రసాద్ కుమార్ , తిమ్మారెడ్డిపల్లి సర్పంచి అంతగిరి పల్లి ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉపేందర్ రెడ్డి ,యావాపూర్ సర్పంచ్ మంగలి శివ నీల లక్ష్మణ్ , పులుమామిడి సర్పంచ్ దాన నరసింహులు , గేట్ మనం పల్లి అనిత ఆంజనేయులు ,కుమ్మరిగూడ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ,గంగాడ సర్పంచి దోసాడా మల్లేష్ , చించల్ పెట్ సర్పంచ్ అనసూయ అనంత రాములు , ఉప సర్పంచ్ లు పులుమామిడి నాగిరెడ్డి మల్లేష్ ,రాజు గోపాలకృష్ణ , దాదాపూర్ మహేందర్ రెడ్డి ,ప్రభాకర్ రెడ్డి ,పాండు రంగా రెడ్డి , మాజీ ఉపసర్పంచ్ ఊరెళ్ళా సుధాకర్ , మల్లేశం, గోపాల కృష్ణ చంటి బందయ్య, ఊరెళ్ళా అశోక్, గేట్ వనంపల్లి ప్రసాద్ ఉప సర్పంచ్ రాజు గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి పడమటి గోపాల్ రెడ్డి మచిందర్ అమీర్ ఖాన్, హరి ప్రసాద్ రామలక్ష్మి పద్మమ్మ రాములు, మానేయ బాలరాజ్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఇందిరమ్మ కమిటీ మెంబెర్స్ సీనియర్ నాయకులు , పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూడుచింతలపల్లి పీహెచ్‌సీ తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సేవలపై సమీక్ష





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఆయన హాజరు పట్టికలు, మందుల నిల్వ రిజిస్టర్లు, రోగుల చికిత్స రికార్డులను పరిశీలించారు. ఎటువంటి అలసత్వం లేకుండా రికార్డులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలతో ముఖాముఖి మాట్లాడికి అందు తున్న పౌష్టికాహారం, వైద్య సేవలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై ఆరా తీశారు. శిశువుల ఆరోగ్య సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిం చారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేయాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికా రులు, ఆరోగ్య సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# సిఎంసి పరిధిలో ఎస్టిపి ప్లాంట్లను పరిశీలించిన జలమండలి ఎండి అశోక్ రెడ్డి



**శేరిలింగంపల్లి, (జనంసాక్షి) :** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు చెరువుల పునరుద్ధరణ, సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్టీపి)లు మరియు చెరువుల ప్రక్షాళననే ప్రధాన లక్ష్యంగా జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి బుధవారం శేరిలింగంపల్లిలో పర్యటించారు. సైబరాబాద్ నగరపాలక సంస్థ పరిధిలోని చెరువుల పునరుద్ధరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులను సిఎంసి కమిషనర్ సృజనతో కలసి జలమండలి ఎండి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సైబరాబాద్ పరిధి నెక్నంపూర్, చిత్రపురి, ఖాజాగూడ, ముష్కిన్ చెరువు ప్రాంతాలలో ప్రతిపాదించిన మురు గునీటి శుద్ధి కేంద్రాలతో పాటు పాన్ దెన్ వాగు, మణికొండ ప్రాంతాల్లో జరుగుతున్న నాలాల అభివృద్ధి పనులను వారు నిశితంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల్లో ఎలాంటి ఉదాసీనత, జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితు ల్లోనూ రాజీ పడకూడదని ఇందులో భాగంగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఖాజాగూడ చెరువు వద్ద మురుగునీటి లీకేజీలను తక్షణమే అరికట్టాలని, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ పెంచి బాధ్యతాయుతంగా పనిచేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పనులు పూర్తయితే నగరంలో వరద ముప్పు తగ్గడమే కాకుండా భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటాయని, పర్యావరణ పరిరక్షణకు ఇవి ఎంతగానో దోహదపడతాయని జలమండలి ఎండి, సిఎంసి కమిషనర్ స్పష్టం చేశారు.